## క్లుప్తంగా

### గౌడబంధు ప్రకటించాలి


నిరసన తెలుపుతున్న గీత కార్మికులు

కమాన్‌పూర్: రైతుబంధు, దళితబంధు మాదిరిగానే గౌడబంధు ప్రకటించి ప్రతి గీత కార్మికునికి రూ.10లక్షల ఆర్థికసాయం అందించాలని సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లెర్ల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగీర్ అంజన్న గౌడ్ పిలుపు మేరకు రామగిరి మండలం కల్వచర్లలో శనివారం గీత కార్మికులు తాటిచెట్టు ఎక్కి నిరసన తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ కులాలకు రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించి అందులో గౌడ కులస్తులను మినహాయించడం బాధాకరమని వాపోయారు. కులవృత్తులకు అందించే రూ.లక్ష ఆర్థికసాయంలో గౌడ కులస్తులను చేర్చాలని కోరారు. కార్యక్రమంలో మోకు దెబ్బ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్యాల మోహన్, ముత్యం సతీశ్, బొల్లపల్లి కృష్ణ, బత్తిని నర్సయ్య, మల్యాల గణపతి, బూర్గు రమేశ్, వీరవేన వెంకన్న, గడ్డం సంపత్, తాటి సురేశ్ పాల్గొన్నారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


హర్షం వ్యక్తం చేస్తున్న సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: దివ్యాంగుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం వచ్చే నెల నుంచి రూ.4116 పింఛన్ ఇవ్వాలని నిర్ణయించడం సంతోషకరమని సురక్ష దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వినయ్‌చంద్‌జైన్ అన్నారు. పెద్దపల్లిలో శనివారం సీఎం చిత్రపటానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పురాజ్‌కుమార్ తదితరులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. నాయకులు రవికిరణ్, రాజలింగం, అంజయ్య, రహమాన్, రాజమౌళి, దస్తగిరి, రాములు, మధు, యాకుబ్ పాల్గొన్నారు.

### వ్యవసాయ క్షేత్రంలో గోపూజ


గోపూజలో రఘువీర్‌సింగ్

జూలపల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రీతి, సంపత్ సింగ్, రణవీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు మంథనిలో 2కె రన్

మంథని: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 12న మంథనిలో తెలంగాణ 2కె రన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. మంథని బొక్కల వాగు కొత్త బ్రిడ్జి నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్ డిపో దగ్గర యూటర్న్ తీసుకొని జూనియర్ కాలేజీ గ్రౌండ్ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రన్‌లో పాల్గొనే వారు మంథని, రామగిరి, కమాన్‌పూర్ మండలాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నాలుగు మండలాలకు చెందిన వారు మంథనిలో జరిగే 2కె రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

### ఆర్థిక చేయూత


నిత్యావసరాలు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ధర్మారం: మండల గ్రామానికి చెందిన నిరుపేద కాల్వ శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. కాగా అలయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ తాళ్లపెల్లి సురేందర్, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కొత్త మోహన్, మామిడిశెట్టి శ్రీనివాస్ శనివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి 25కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. క్లబ్ సభ్యులు ఎలిగేటి మహేందర్, భైరి చంద్రమౌళి, గుండేటి రాజేశం, రజక సంఘం అధ్యక్షుడు అర్దవెల్లి రాము, గుడికందుల ఎల్లయ్య, రాగల్ల చందు, కాలువ రాజేందర్, నర్సింగం పాల్గొన్నారు.

# పరిపాలన సౌలభ్యం కోసమే నూతన జిల్లాలు

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే చందర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

రామగుండం: రాష్ట్రం ఆవిర్భావం తర్వాత దశాబ్ద కాలంలో నియోజకవర్గంలో అనేక మార్పులు జరిగాయని, పరిపాలన సౌలభ్యం కోసమే సీఎం కేసీఆర్ నూతన జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేశారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎంపీపీ దుర్గం విజయ అధ్యక్షత వహించిన అంతర్గాం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అంతర్గాం మండల కేంద్రంలో మహిళా భవన్ నిర్మించాల్సి ఉందని ఐకేపీ ఏపీఎం నంది నర్సమ్మ, మండల కేంద్రంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మించేందుకు ఇప్పటికే స్థలం ఎంపిక చేసినప్పటికీ నిర్మాణ పనులకు సహకరించాలని ట్రాన్స్‌కో ఏఈ శంకర్, తహసీల్దార్ కార్యాలయం నూతన భవనం నిర్మించాల్సి ఉందని డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, అంతర్గాం పీహెచ్‌సీతో పాటు సబ్‌సెంటర్లలో 24 గంటల వైద్య సేవలు అందించాలని హెల్త్ అసిస్టెంట్ సురేశ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వీటన్నింటికీ ఎన్నికల్లోగా పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తానని హామీ ఇచ్చారు. ఎగ్లాస్‌పూర్‌లో వేలాడుతున్న విద్యుత్ తీగలను పునరుద్ధరించాలని, అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని సర్పంచ్ దేవమ్మ సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో మోతె సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్రంలోని అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెగడపల్లిలో రూ.5లక్షల సీడీపీ నిధులతో విశ్వబ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం శిలాఫలకాన్ని ఎమ్మెల్యే శనివారం ఆవిష్కరించారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సర్పంచ్ ఆరెల్లి సుజాత, ఎంపీటీసీ సుముకం నిర్మల, పీఏసీఎస్ చైర్మన్లు చదువు రాంచంద్రారెడ్డి, గజవెల్లి పురుషోత్తం, వార్డుసభ్యుడు మియాపురం సతీశ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోటగిరి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి దోమకుంట శ్రీనివాస్, మహేందర్, బాపు, సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ జిన్న రాంచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ రాజకొమురయ్య, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ దేవయ్య పాల్గొన్నారు.

**కార్యకర్తలను పార్టీ ఆదుకుంటుంది**

ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలను పార్టీ ఆదుకుంటుందని బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామపంచాయతీ పరిధిలోని ఊశన్నపల్లె గ్రామానికి చెందిన పెండ్లి సంపత్‌రెడ్డి ఇటీవల విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. బాధితుడి భార్య అనసూర్యకు బీఆర్‌ఎస్ సభ్యత్వం తరఫున రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును శనివారం ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, సర్పంచ్ కొంకటి మల్లారెడ్డి, ఎంపీటీసీ మానస, వార్డుసభ్యులు హుస్సేన్, తిరుపతి, సౌమ్య, కొండాల్, భాగ్యమ్మ, నాయకులు నరెడ్ల సదయ్య పాల్గొన్నారు.

# 'అనర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు'


మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

పాలకుర్తి(రామగుండం): ఈసాలతక్కళ్లపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 746, 747లలోని ప్రభుత్వ భూమిలో అనర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలిచ్చారని స్థానిక దళితులు ఆరోపించారు. శనివారం సంబంధిత భూమి వద్ద సమావేశమై, మాట్లాడారు. 1983లో అప్పటి ప్రభుత్వం భూమి లేని నిరుపేదలను గుర్తించి, 108 మందికి ఈ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించిందని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా ఇళ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. అప్పటినుంచీ తామే ఖాస్తులో ఉన్నామని చెప్పారు. పాలకుర్తి ప్రస్తుత తహసీల్దార్ గతంలో లిస్టులో ఉన్నవారికి కాకుండా ఇతరులకు రెండు రోజుల క్రితం పట్టాలు పంపిణీ చేశారని ఆరోపించారు. తమకు కేటాయించిన స్థలాన్ని తమకే ఇవ్వాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే ప్రత్యక్ష ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు. వీరికి ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాడుతామని పేర్కొన్నారు. సమావేశంలో గాలిపెల్లి దుర్గయ్య, నెరువట్ల తిరుపతి, రెడపాక రాములు, తుంగ నర్సయ్య, నెరువట్ల సతీశ్‌తోపాటు దళిత కులస్తులు పాల్గొన్నారు. కాగా సంబంధిత విషయమై తహసీల్దార్ సునీతను వివరణ కోరగా.. సర్వే నంబర్ 746, 747లలో మొత్తం 7.06 ఎకరాల భూమికి గాను సబ్‌స్టేషన్ నిర్మాణానికి, సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణకు కొంత స్థలం కేటాయించినట్లు తెలిపారు. గ్రామంలో పారదర్శకంగా విచారణ జరిపి, మిగిలిన 4 ఎకరాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలలో పూర్తిస్థాయిలో భూమిలేని నిరుపేదలకే పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. మరికొంత మంది అర్హులను గుర్తించి, వారికి కూడా భూమి ఇస్తామన్నారు.

# రాష్ట్రంలో బీసీ సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: బీసీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక తిలక్‌నగర్ డౌన్‌లోని విశ్వం కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. గతంలో బీసీ రుణాలు పొందాలంటే తిప్పలు పడాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఎలాంటి షూరిటీ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష సాయం అందిస్తోందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు మంథని రఘువీర్‌ప్రసాద్, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు గుంపుల ఓదెలుయాదవ్, ప్రధాన కార్యదర్శి కన్నూజు నారాయణచారి, నాయకులు కనకయ్య, కంది చంద్రయ్య, బొల్లం రవిగౌడ్, అనుముల కళావతి, నీలావతి, రాజమౌళి, నర్సయ్య, రాజమల్లు, రవి, సమ్మయ్య, స్వరూప, విజయ, మల్లయ్య పాల్గొన్నారు.

**'గృహలక్ష్మి' ద్వారా సొంతింటికి సాయం**

గోదావరిఖని: సొంత జాగాలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా సాయం అందిస్తామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక 31వ డివిజన్‌లో శనివారం రాత్రి రామగుండం దశాబ్ది ప్రగతియాత్రను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో రూ.4.24కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మేయర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్ అడ్డాల స్వరూప, అడ్డాల గట్టయ్య, కల్వచర్ల కృష్ణవేణి ఉన్నారు.

**డ్యాన్స్‌తో ఆరోగ్యం**

యైటింక్లయిన్‌కాలనీ: చిన్నారులు డ్యాన్స్ నేర్చుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ శనివారం రాత్రి సీఆర్‌క్లబ్‌లో బిట్ బిట్ ప్రశాంత్ డ్యాన్స్ అకాడమీ వారు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. 45రోజుల పాటు డ్యాన్స్ నేర్చుకున్న చిన్నారులకు షీల్డ్ అందజేశారు. టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, జక్కుల దామోదర్ రావు, క్లబ్ సెక్రటరీ హమీద్, దశరథం గౌడ్ పాల్గొన్నారు.

# వాకింగ్ చేస్తుండగా పుస్తెలతాడు చోరీ

- యువకుడిని పట్టుకున్న స్థానికులు
- దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగింత


దొంగను పట్టుకున్న స్థానికులు

పెద్దపల్లిరూరల్: వాకింగ్ చేస్తున్న ఓ మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీ చేసి, పరుగెత్తుతున్న ఓ యువకుడిని స్థానికులు పట్టుకున్నారు. ఈ ఘటన పెద్దపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ, గుండమ్మ చెరువు కట్టపై పెద్దమ్మ నగర్‌కు చెందిన ఈగ స్పందన శనివారం ఉదయం వాకింగ్ చేస్తోంది. పట్టణంలోని సాగర్ రోడ్డుకు చెందిన సాగిరి భానుప్రకాశ్ ఆమెను అనుసరిస్తూ వెళ్లాడు. కాసేపటికి స్పందన మెడలోని పుస్తెలతాడు లాక్కొని, పరుగెత్తాడు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు అతన్ని వెంబడించి పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి, పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, భానుప్రకాశ్ వద్ద నుంచి 3 తులాల పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### బీఎస్పీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఓదెల: మండలంలోని కనగర్తి గ్రామంలో బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సీఎస్‌సీ హెల్త్‌కేర్ వారు శనివారం నిర్వహించిన వైద్యశిబిరంలో బీపీ, షుగర్, గుండె సమస్యలు, కొలెస్ట్రాల్, టెస్ట్‌లను ఉచితంగా చేశారు. 150 మందికి వివిధ పరీక్షలు చేయడంతో పాటు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గాజుల శ్రీనివాస్, కళ్యాణం మహేశ్, కాసర్ల శ్రీనివాస్, సాదిక్, ఎండీ వాహిద్ పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ బలరాంరెడ్డి

ధర్మారం: మండలంలోని పెర్కపల్లిలో పెర్కపల్లి ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి ప్రారంభించారు. వివిధ జిల్లాలకు చెందిన 40 టీమ్‌లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా బలరాంరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించడం హర్షనీయమని, క్రీడాకారులకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. టోర్నమెంట్ విన్నర్ టీమ్‌కు రూ.20,116, రన్నర్ టీమ్‌కు రూ.10116 నగదు అందజేసున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ మొట్టె లక్ష్మిశంకర్, టీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సత్తనవేని సదయ్య, పెర్కపల్లి ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు శ్రీనివాస్‌యాదవ్, మహేశ్, శేఖర్, ఉదయ్, పిట్టల మహిపాల్ పాల్గొన్నారు.

### బీఎస్‌ఏ కమిటీ సభ్యురాలిగా జ్యోతి


కమిటీ సభ్యురాలిగా నియామకమైన జ్యోతి

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని దాసరిపల్లెకు చెందిన భూపెల్లి జ్యోతిని బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ అవార్డు కమిటీ సభ్యురాలిగా నియమించినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. జ్యోతి గతంలో సాహిత్య అకాడమీ నేషనల్ అవార్డుకు ఎంపికై ఢిల్లీలో అవార్డు అందుకుంది. ఆమె నియమాకంపై పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రతి కుటుంబానికి రూ.12 లక్షలు ఇవ్వాలి


గోదావరిఖని చేరుకున్న సంకల్ప యాత్ర

గోదావరిఖని: న్యూ ఇండియా పార్టీ నాయకులు చేపట్టిన ఆర్థిక స్వేచ్ఛ విజయ సంకల్ప యాత్ర శనివారం గోదావరిఖని చేరింది. నాయకులు మాట్లాడుతూ.. గత, ప్రస్తుత ప్రభుత్వాలు కొన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నాయని అన్నారు. తమ పార్టీ ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం పోరాడుతోందని తెలిపారు. ముఖ్యంగా ప్రతీ కుటుంబానికి రూ.12 లక్షలు అందించి, వ్యాపార అవకాశం కల్పించాలని, ప్రతీ గ్రామానికి రూ.5 కోట్లు కేటాయించి, పరిశ్రమలు స్థాపించి, అందరికీ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు జేవీ రాజుబాయి పటేల్, జె.లక్ష్మీనారాయణ, అశోక్ వేముల, జనగామ తిరుపతి, గంటా బబిత, శంకర్, వి.రామాచారి పాల్గొన్నారు.

### పాలకుర్తిలో సుపరిపాలన దినోత్సవం

పాలకుర్తి: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీవో లలిత మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న సర్పంచులు, ఎంపీటీసీలను ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీవో షబ్బీర్ పాషా, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**✦12న మండల సర్వసభ్య సమావేశం**

కమాన్‌పూర్: మండల సర్వసభ్య సమావేశం 12న ఎంపీపీ రాసకొండ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు.

**✦పద్మశాలీ సంఘం గ్రామ అధ్యక్షుడిగా కనుకయ్య**

ధర్మారం: ధర్మారం మండలం కొత్తూరు గ్రామ పద్మశాలీ కుల సంఘం అధ్యక్షుడిగా కోడూరి కనుకయ్యను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో పలు అంశాలపై చర్చించిన తర్వాత కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా కనుకయ్య, ఉపాధ్యక్షుడిగా బత్తుల వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా బత్తుల నరేశ్, సహాయ కార్యదర్శిగా కోడూరి చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులుగా కొక్కుల రాంనారాయణ, గోనె లక్ష్మీనారాయణ, సతీశ్ ఎన్నికయ్యారు.

**✦తెలంగాణ రన్ విజయవంతం చేయాలి**

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 12న రామగుండం కమిషనరేట్ పరిధిలో గోదావరిఖనిలో పోలీస్, క్రీడాశాఖల ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ రన్ కార్యక్రమంలో పాల్గొనే వారు గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు చేసుకోవాలని సీఐ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిపోర్టు చేసుకున్న వారిని యైటింక్లయిన్‌కాలనీ టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి బస్సుల్లో గోదావరిఖనికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. తెలంగాణ రన్‌లో అన్ని వర్గాల ప్రజలు నాయకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐ కోరారు.

**✦పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి**

కాల్వశ్రీరాంపూర్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో ఆరెపల్లి రాజయ్య అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మన ఊరు–మనబడి పథకంలో భాగంగా ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి కార్పొరేట్ స్థాయికి దీటుగా సకల సౌకర్యాలు ఏర్పాటు చేసిందన్నారు.

**✦మల్లన్న ఆలయానికి బస్సు నడిపించాలి**

ఓదెల: జిల్లాలోని ప్రముఖ దేవస్థానం ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానానికి గతంలో రద్దయిన ఆర్టీసీ బస్సును తిరిగి నడిపించాలని ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, ఓదెల ఎంపీపీ కునారపు రేణుకదేవి శనివారం కోరారు. మడక, కనగర్తి వయా ఓదెల గుడి వరకు నడిచే కరీంనగర్ డిపోకు చెందిన బస్సు రద్దు కావడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారని, ఆర్టీసీ అధికారులు వెంటనే బస్సును నడిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.

**✦హైమాస్ట్ లైట్లు ఏర్పాటు**

ధర్మారం: మండలంలోని కటికెనపల్లిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను శనివారం జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ ప్రారంభించారు. సర్పంచ్ కారుపాకల రాజయ్య, ఎంపీటీసీ సూరమల్ల శ్రీనివాస్, నాయకులు మానుపాటి సాయిలు, రాజయ్య, తిరుమల రాజేశం, చేపూరి తిరుపతి, కుమార్, ఆవుల మల్లేశం, ప్రభాకర్ పాల్గొన్నారు.

### ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఉద్యమకారులు

ఎలిగేడు: రాష్ట్ర ఉద్యమ నాయకుడు, ప్రజాహిత వ్యవస్థాపకుడు చింతలఫణి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 12న జరిగే ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు బింగి రాజు కోరారు. ఎలిగేడు మండల కేంద్రంలో శనివారం ఉద్యమకారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఉద్యమకారులను ఆదుకోవాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా ఉద్యమకారులు తమ గుర్తింపు కోసం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యమకారులు తానిపర్తి బుచ్చారావు, కవ్వంపల్లి రాము, పవన్, శంకర్, రామస్వామి, పంగ రవి, ఇరుకుల్ల రవి పాల్గొన్నారు.

# అధికారంలోకి రాగానే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తాం


మాట్లాడుతున్న విజయరమణారావు

సుల్తానాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగం నిర్మూలించేందుకు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పట్టణంలోని 2, 3వ వార్డు గుడిమిట్టపల్లి, రజకనగర్, పాతజెండా, గడి మహల్, పోచమ్మ వాడలో శనివారం గడపగడపకు కాంగ్రెస్ అనే నినాదంతో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుల్తానాబాద్ నుంచి తరలిన ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే వచ్చేలా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ హయాంలో ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు పెరిగాయని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాశ్‌రావు, సాయిరి మహేందర్, దన్నాయక్ దామోదర్ రావు, చిలుక సతీశ్, ఎండీ నిషాద్ రఫీక్, సంజీవ్, ఎండీ మొబిన్, నోముల శ్రీనివాస్‌రెడ్డి, పన్నాల రాములు, చింతల రాజు, దున్నపోతుల రాజయ్య, ఎండీ మతీన్, అమిరిశెట్టి రాయలింగు, తిరుపతి, కుమార్ కిషోర్, ఉట్ల ప్రశాంత్, తొర్రికొండ ప్రభాకర్, బావు రాజేందర్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతి కోసం ప్రత్యేక చొరవ


ముగ్గు వేస్తున్న అంగన్‌వాడీలు, మెప్మా సిబ్బంది

సుల్తానాబాద్: మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా సిబ్బంది ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు పొందుతున్న తీరును ముగ్గురూపంలో వేసి అందరినీ ఆకట్టుకున్నారు. కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు దున్నపోతుల రాజయ్య, గొట్టం లక్ష్మి, పసేడ్ల మమత, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గుణపతి, కోఆప్షన్ సభ్యులు రాధ, సాజిత్ నాయకులు రమేశ్‌గౌడ్, చంద్రయ్య, శ్రీనివాస్, అధికారులు సాగర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

### జాబ్ మేళాకు స్పందన


ఉద్యోగ పత్రాలతో నిరుద్యోగులు

గోదావరిఖని: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 40 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2230 మంది అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరు కాగా 144మందికి అక్కడికక్కడే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారు. వివిధ కంపెనీలు ఇంటర్వ్యూ కేంద్రంలోనే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందజేశారు. 206మంది అభ్యర్థులు మరొక లెవల్‌కు ఎంపిక అయ్యారని వీరికి కూడా త్వరలో అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందజేయనున్నట్లు తెలిపారు.

**సింగరేణి స్క్రాప్ పట్టివేత**

ఫెర్టిలైజర్‌సిటీ: సింగరేణి స్క్రాప్‌ను ఆటోలో శనివారం అక్రమంగా తరలిస్తుండగా రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలో గ్రామస్తులు పట్టుకున్నారు. కొన్ని రోజులుగా సింగరేణి స్క్రాప్‌ను ఆటోల్లో ఎత్తుకెళ్తున్నారని వారు తెలిపారు. అంతేకాకుండా ఇళ్ల పరిసరాల్లో ఉన్న బిందెలు, బకెట్లు సైతం చోరీకి గురవుతున్నాయని ఆరోపించారు. అనంతరం సదరు ఆటోను గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.